## "నగ(్న)సత్యం"

అప్పలసామి యిల్లు తోరణాలతో. రంగు రంగు దీపాలతో కళ కళలాడుతూ దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అప్పలసామికొడుకు వెంకటసామికి అనకాపల్లిలో వివాహమై గృహప్రవేశానికి ఆ రోజు వస్తున్నాడు. ముందుగా ఏర్పాట్లన్నీ చెయ్యడానికి అప్పలసామి వాళ్ళవూరు తుని వచ్చేశాడు. ట్రయిన్ వచ్చేవేళయింది. బాజా భజంత్రీలు వాళ్ళని రెండవ కొడుకు వీరాసామినిచ్చి స్టేషన్‌కి పంపించాడు. వాళ్ళరాక కోసం కుర్చీలో కూర్చుని ఎదురు చూస్తున్నాడు. ఇంతలో పోలీస్ కాన్‌స్టేబుల్ రామసామి వచ్చి ఒక సంచీ చేతికివ్వబోతే లోపల టేబిల్ మీద పెట్టి కాఫీ త్రాగి వెళ్ళమన్నాడు. రాత్రికి డిన్నర్‌కి ఫేమిలీతో సహా తప్పక వచ్చేయాలని హెచ్చరించాడు అప్పలసామి.

పెళ్ళివారు వచ్చేశారు. ఇల్లంతా చాలా హడావుడిగావుంది. వచ్చిన వాళ్ళని ఆహ్వానించడం, వాళ్ళకి కాఫీలు. టిఫిన్లు అందించడం చిరుముఖంతో పలకరించడంతో సరిపోతోంది. ఆ ఊరి సబిన్‌స్పెక్టర్ సకుటుంబంగా వచ్చి వధూవరులను దీవించాడు. అప్పలసామి ఆనందం అంతా ఇంతా కాదు.

భార్యని పిలిచి టేబిల్ మీద సంచీలో వున్న వస్తువులని జాగ్రత్తగా తీసి పెళ్ళికూతురికి యిమ్మన్నాడు. విమల్ సూట్‌లో ముస్తాబయిన పెళ్ళికొడుకు ప్రక్కన



సోఫాలో కూర్చోపెట్టారు పెళ్ళికూతుర్ని. వచ్చిన వాళ్ళంతా పెళ్ళికూతురు రూపురేఖలు, అందచందాలు చూడకుండా ఆమె ధరించిన విలువైన నగలని, వాటి డిజైన్లని చూసి మురిసిపోతున్నారు. కొంత మంది ముత్తైదువులైతే చేత్తో పట్టుకుని మరీ చూస్తున్నారు! ఉండబట్టలేక ప్రక్కింటి అనూరాధ అడగనే అడిగేసింది: "మీ పుట్టింటివారు పెట్టేరా" అని. "లేదు మా అత్తవారు ఇచ్చినవే" అంది". గిల్టు నగలేమో అన్న అనుమానం అనూరాధకి వచ్చింది.

అప్పలసామి భార్యని పిలిచి "మా అప్పల బావ యింకా రాలేదేంటి? బస్సు మధ్యాహ్నమే వచ్చి వుండాలికదా! వీరాసామిని స్టాండుకి పోయి చూడమను" అంటున్న అప్పలసామి అప్పుడే గుమ్మంలో అడుగు పెడుతున్న బావని, అప్ప తాయారమ్మని చూసి, "రండి. యింత ఆలస్యమేమిటి" అని లోపలికి తీసుకెళ్ళాడు.

బస్సుదిగి స్టాండులో రిక్షాకోసం నిలబడ్డ తాయారమ్మ నగలు ఎవరో కొట్టేశారు. లబో దిబోమని ఏడుస్తూ పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చిరావడానికి అంత ఆలస్యమైంది. ఈ శుభసమయంలో ఇప్పుడెందుకులే చెప్పడం అనుకుంది తాయారమ్మ. లోపలికి వెళ్ళి పెళ్ళికూతుర్ని, పెళ్ళికొడుకుని దీవించి అక్షింతలువేసి పెళ్ళికూతురు ధరించిన నగలని చూసి నోరవ్వగించి. కళ్ళుతిరిగి నట్టయితే లోపలికెళ్ళి చతికిలపడింది.

ఎంత బుర్రబాదుకున్నా అర్థంకాలేదు. బస్సుస్టాండులోపోయిన తన నగలు పెళ్ళికూతురు ఒంటిమీదకెలా వచ్చాయో?

—ఓ.ఆర్.కె. రావ్

